క్లుప్తంగా

పారిశుద్ధ్య కార్మికులకు రైన్ కోట్లు అందజేత



చిలకలూరిపేట: విపత్తు సమయాల్లో పారిశుద్ధ్య కార్మికుల సేవలు ఎంతో విలువైనవని ఆర్యవైశ్య విద్యానిధి కన్వీనర్ పొట్టి శ్రీరాములు చెప్పారు. పట్టణంలోని ఆర్యవైశ్య కల్యాణ మండపంలో శ్రీ వెంకటేశ్వరస్వామి ఆర్యవైశ్య కళ్యాణ మండప సంఘం, ఆవోపా, ఆర్యవైశ్య విద్యానిధి సంయుక్త ఆధ్వర్యంలో 90 మంది పారిశుద్ధ్య కార్మికులకు మంగళవారం రైన్ కోట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షంలో విధులు నిర్వహిస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు చేయూతనందించాలన్న సంకల్పంతో ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు కేవీఎస్ కృష్ణుడు, మాజేటి నరేంద్ర, కొలిశెట్టి సతీష్, శానిటరీ ఇన్స్‌పెక్టర్ షేక్ ఇస్మాయిల్ పాల్గొన్నారు.

పెట్రోలు బంకు ఏర్పాటుకు అనుమతులు

శావల్యాపురం: మండలంలోని కనమర్లపూడి గ్రామసమీపాన జాతీయ రహదారి మార్గంలో ప్రభుత్వ స్థలంలో త్వరలో పెట్రోలు బంకు ఏర్పాటుకు అనుమతులు జారీ అయినాయని తహసీల్దారు షేక్ జాన్‌సైదులు మంగళవారం తెలిపారు. ఈసందర్భంగా తహసీల్దారు మాట్లాడుతూ జాతీయ రహదారి వెంబడి సర్వే నంబరు 176/1 గాను ఎకరం 60 సెంట్లు ఉండగా వేబ్రిడ్జి 30 సెంట్లు కేటాయించగా ప్రస్తుతం 33 సెంట్లు స్థలంలో పెట్రోలు బంకు ఏర్పాటుకు అధికారులు స్థల పరిశీలన చేశారన్నారు. త్వరలో భూమి పూజ చేయనున్నట్లు తెలిపారు.

తుఫాన్ ప్రభావంతో ఆరుతడి పంటలకు ప్రాణం

శావల్యాపురం: మిచాంగ్ తుఫాన్ ప్రభావం ధాటికి ఆరుతడి పంటలైన కంది, మొక్కజొన్న, మిరప పంటలకు ప్రాణం పోసినట్లు ఉందని మండల వ్యవసాయ అధికారి పి.ప్రవీణ్ మంగళవారం తెలిపారు. అన్నీ గ్రామ పంచాయతీలో ఖరీఫ్, రబీ సీజనులో వరి-105, కంది-1902, మిరప-557, మొక్కజొన్న -263, మినుము-120, శనగ -1467, ఇతర పంటలు -250 ఎకరాల్లో అన్నదాతలు సాగు చేశారన్నారు. ఇప్పటి వరకు కురిసిన వర్షం వలన ఆరుతడి పంటలకు ప్రాణం పోయగా ఆశించిన స్థాయిలో దిగుబడులు వస్తాయన్నారు. అదే విధంగా వర్షం పడితే పూర్తిస్థాయిలో పంటలు దెబ్బతింటాయన్నారు. వరి ఒదెలు పడిపోయి ధాన్యం మొలకెత్తకుండా ఉండటానికి ఉప్పు ద్రావణాన్ని పిచికారీ చేయాలన్నారు. ఆరుతడి పంటలు సాగు చేసిన రైతులు వర్షపు నీరు నిల్వ ఉండకుండా పొలాల్లో పంట కాల్వలు తీయాలన్నారు.

మిర్చిలో యాజమాన్య పద్ధతులు పాటించాలి

ఉద్యానవన శాఖ అధికారి వై.మోహన్

పిడుగురాళ్లరూరల్: మిచాంగ్ తుపాన్ నేపథ్యంలో మిర్చి రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలని ఉద్యానవన శాఖ అధికారి వై.మోహన్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...అధిక వర్షాల వలన లోతట్టు ప్రాంతాలలో నీరు నిలబడి మిరప పంట ముంపునకు గురై నష్టం వాటిల్లుతుందన్నారు. అధిక తేమ వలన అవసరమైన పోషకాలు అందక పంటను పురుగులు, తెగుళ్ల ఆశించడమే కాకుండా సూక్ష్మధాతులోపాలు కూడా కనబడే అవకాశముందన్నారు. పంట దశ, ముంపు ఉధృతిని బట్టి తగిన జాగ్రత్తలు పాటించినట్లయితే పంటను రక్షించుకొని నష్టాన్ని కొంత వరకు తగ్గించుకునే అవకాశం ఉందన్నారు. మిరప పంట ప్రస్తుతం పూత నుండి కాయ ఏర్పడే దశలోను, లేదా శాఖీయ దశలో ఉందన్నారు.

తీసుకోవాల్సిన చర్యలు..

పొలంలో అధికంగా వున్న నీటిని వెంటనే బయటికి పంపించే ఏర్పాటు చేయాలి, వాలిపోయిన మొక్కలను జాగ్రత్తగా నిలబెట్టి మొదలు చుట్టూ మట్టిని ఎగదోయాలన్నారు. నేల అదునుకు వచ్చిన వెంటనే గొర్రుతో అంతర కృషి చేయాలన్నారు. మొక్కలు తేరుకున్న తరువాత స్థూల పోషకాల మిశ్రమాన్ని, సూక్ష్మపోషకాల మిశ్రమాన్ని ఒక దాని తరువాత ఒకటి వారం రోజుల వ్యవధిలో 2-3 సార్లు పిచికారీ చేయాలన్నారు. ఆకుమచ్చ, కోనోధారా వంటి తెగుళ్లు ఆశించే అవకాశం ఉంది కాబట్టి, ముందు జాగ్రత్త చర్యగా 10 లీటర్ల నీటికి 30 గ్రాముల కాపర్ ఆక్సీక్లోరైడ్, 1 గ్రాము స్ట్రెప్టోసైక్లిన్ కలిపిన ద్రావణం పిచికారీ చేసి వీటి వ్యాప్తిని అరికట్టాలన్నారు.

ఆస్పత్రికి వెళ్లి.. పింఛను అందజేసి..

దుర్గి: అనారోగ్యంతో నరసరావుపేటలోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నిరుపేద కుటుంబానికి చెందిన మహిళకు పెన్షన్ అందించిన సంఘటన జరిగింది. మండల కేంద్రం దుర్గికి చెందిన బండ్ల నాగమణి అనారోగ్యంతో నరసరావుపేటలోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతుంది. పేద కుటుంబం కావటంతో ఆస్పత్రిలోని ఖర్చులకు డబ్బు అవసరాన్ని గుర్తించిన వలంటీర్ తాళ్ళూరి శిరీష తన సొంత ఖర్చులతో నరసరావుపేట వెళ్లి నాగమణికి పెన్షను అందజేసింది.



పసుమర్రులో నీట మునిగిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్



చిలకలూరిపేటలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న నేతలు



గణపవరం కుప్పగంజి వాగుపై ఉధృతంగా వరద



నాదెండ్లలో విద్యుత్ తీగలపై పడ్డ చెట్టు

జనజీవనంపై మిచాంగ్ ప్రభావం

ఎడతెరపని వానతో జనజీవనం స్తంభించింది. పట్టపగలే చీకట్లు అలుముకుని పట్టణాలు, గ్రామాలతోపాటు ప్రధాన రహదారులు వెలవెలబోయాయి. ఇంటి నుంచి బయటకు అడుగువేయడానికి జనం భయపడ్డారు. కనీసం గొడుగులు వేసుకుని బయటకు వెళ్లి నిత్యావసరాలు కొనుక్కుందామనుకున్నా వెళ్లలేని స్థితి. మొత్తం మీద మిచాంగ్ తుఫాన్ అటు రైతులతో పాటు సామాన్యులను వణికించింది.

- ఎడతెరిపి ఇవ్వని జోరు వాన
- తెరుచుకోని దుకాణాలు
- బయటకు రాని జనం



చిలకలూరిపేటలో నిత్యం రద్దీగా ఉండే కళామందిర్ సెంటర్‌లో పరిస్థితి

చిలకలూరిపేట: తుఫాన్ ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాలతో జన జీవనానికి తీవ్ర విఘాతం కలిగించింది. సోమవారం సన్నని జల్లులతో ప్రారంభమైన వర్షం, రాత్రి నుంచి తీవ్ర రూపం దాల్చింది. మంగళవారం తెల్లవారు జాము నుంచి గాలులతో పాటు భారీగా వర్షం కురుస్తూ ఉండటంతో జనజీవనం స్తంభించింది. గ్రామీణ ప్రాంతాలలో పంట పొలాలు ముంపునకు గురికాగా పట్టణంలో సైతం పలు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పట్టణంలో ఉన్న పాత రూరల్ పోలీస్ స్టేషన్ ప్రాంగణంలోని చెట్టు కూలి భవనంపై పడి పోయింది. భవనంపై కాకుండా నిత్యం రద్దీగా ఉండే రోడ్డు వైపు పడి ఉంటే ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడి ఉండేవి. వర్షం కారణంగా పట్టణంలో రద్దీగా ఉండే కళామందిర్ సెంటర్ వంటి ఇతర సెంటర్లు వెలవెలబోయాయి. పట్టణంలోని సంజీవనగర్, మదర్ థెరిస్సాకాలనీ, ఆది ఆంధ్రాకాలనీ, శాంతినగర్‌తో పాటు పలు ప్రాంతాలలో వర్షపు నీరు చేరి ప్రజల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఉదయం నుంచి మున్సిపల్, రెవెన్యూ, విద్యుత్ అధికారులు ఇబ్బందుల తొలగింపునకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. మున్సిపల్ కార్యాలయంలో కమాండ్ కంట్రోల్ సెంటర్ ఏర్పాటు చేశారు. వైఎస్సార్ సీపీ నాయకుడు విడదల గోపీ, మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, మున్సిపల్ కమిషనర్ సీహెచ్ గోవిందరావు, తహసీల్దార్ జి.సుజాత, ఇతర అధికారులతో కలసి లోతట్టు ప్రాంతాలను పరిశీలించారు. ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా లోతట్టు ప్రాంతాలకు సమీపంలోని పాఠశాలల్లో పునరావాస కేంద్రాల ఏర్పాటుకు అన్ని చర్యలు తీసుకున్నారు. చెట్టుకొమ్మలు పడి విద్యుత్ అంతరాయం కలిగిన చోట తిరిగి విద్యుత్ సరఫరా పునరుద్ధరించేందుకు వర్షం లోనూ విద్యుత్ సిబ్బంది చెమటోడ్చాల్సి వచ్చింది. అయినప్పటికీ భారీ వర్షం కారణంగా పలు ప్రాంతాలలో విద్యుత్‌కు అంతరాయం కలి గింది. మున్సిపల్ సిబ్బంది వర్షపు నీరు డ్రెయిన్ల ద్వారా సజావుగా పారేందుకు పొక్లయినర్‌తో పలుచోట్ల డివైడర్లను పగలగొట్టి మార్గం సుగమం చేశారు. విరిగిపడిన చెట్టు కొమ్మలను తొలగించేందుకు కృషి చేశారు.

శావల్యాపురంలో

శావల్యాపురం: మిచాంగ్ తుఫాన్ ధాటికి మండలంలోని అన్నీ గ్రామాల్లో ఎడతెరపని వర్షం కురిసింది. మండలంలో వర్షపాతం 13 శాతం నమోదైనట్లు తహసీల్దారు షేక్ జాన్‌సైదులు మంగళవారం తెలిపారు. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో తహసీల్దారు మాట్లాడుతూ మండల కేంద్రం శావల్యాపురంలో రైల్వేగేటు పరిధి లో మిల్లు శ్రీను నివాస గృహంపై చెట్టు పడిపోవటంతో నివాస గృహం పూర్తిస్థాయిలో దెబ్బతింది. అయితే ఎలాంటి ప్రాణ నష్టం వాటిల్ల లేదన్నారు. రూ.50 వేలు నష్టం వాటిల్లినట్లు తహసీల్దారు వివరించారు. మించాన్ తుఫాన్ ప్రభావం జిల్లా కలెక్టరు ఆదేశాలు మేరకు అధికారుల యంత్రాంగాన్ని సిద్ధం చేసి ఉంచామన్నారు. అలాగే బొందిలిపాలెం వెళ్లే రహదారి మార్గంలో రోడ్డుకు అడ్డంగా చెట్టు పడిపోవటంతో వాహనాలు రాకపోకలు అంతరాయం వాటిల్లిందన్నారు.. మిచాంగ్ తుఫాన్ దీంతో ప్రజాజీవనం అస్తవ్యస్తంగా మారడంతో వ్యాపార సంస్థలు మూత పడ్డాయి. మండలంలోని కొత్తలూరు, చినకంచర్ల పోట్లూరు తదితర గ్రామాల్లో వంతెన ఉండటంతో కొంకెరు వాగు ఉధృతి ప్రవాహం పెరగటంతో ఆయా గ్రామాల ప్రజలు రాకపోకలకు అంతరాయం వాటిల్లికుండా అధికారులు ముందుజాగ్రత్త చర్యలు చేపట్టారు. తుఫాన్ ప్రభావంతో చెట్లు పడి విద్యుత్ తీగలు తెగిపోవటంతో తెల్లవారుజాము నుంచి రాత్రి వరకు విద్యుత్ సరఫరా అంతరాయం వలన ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.విద్యుత్ అధికారులు యుద్ధప్రతిపాదికన పనులు చేసి విద్యుత్ ఇవ్వడానికి చర్యలు చేపట్టారు. ఆయనతో పాటు డిప్యూటీ తహసీల్దారు వేముల వెంకట నాగరాజు ఆర్ఐ పి.నాసరయ్య ఉన్నారు.

నాదెండ్లలో...

నాదెండ్ల: మండలంలో మిచాంగ్ తుఫాను ప్రభావంతో జనజీవనం స్తంభించింది. రైతులు పంటలు నీటి మునిగాయి. వాగులు పొంగాయి. కొన్ని చోట్ల చెట్లు విరిగి విద్యుత్ స్తంభాలపై పడటంతో విద్యుత్‌కు అంతరాయం ఏర్పడింది. గణపవరం నుంచి చిలకలూరిపేటకు వెళ్లే కుప్పగంజి పొంగిప్రవహించింది. రాకపోకలు స్తంభించాయి. చిలకలూరిపేట-నరసరావుపేట రహదారి మార్గమధ్యలో అమీన్‌సాహెబ్‌పాలెం వద్ద ఉన్న లోలెవల్ చప్టాపై వరద నీరు ప్రవహించింది. రాకపోకలు నిలిచి పోయాయి. తుబాడు మార్గమధ్యలో ఉన్న లోలెవల్ చప్టాపై వరద నీరు ప్రవహించింది. తహసీల్దార్ నాగమల్లేశ్వరరావు గణపవరం, చిరుమామిళ్ల, అమీన్‌సాహెబ్‌పాలెం తుబాడు గ్రామాలను సందర్శించారు. గణపవరం చప్టా వద్ద హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయించారు.

చెట్లు విరిగి విద్యుత్‌కు అంతరాయం

గణపవరం సీఆర్ కళాశాల వద్ద నాదెండ్ల పశువుల ఆసుపత్రి వద్ద, కనపర్రు పంటపొలాల్లో అమీన్‌సాహెబ్‌పాలెం వద్ద చెట్లు విరిగి తీగలపై పడటంతో అంతరాయం ఏర్పడింది. ఏఈ ప్రసాద్ సిబ్బందితో తెగిన విద్యుత్ తీగలను సరి చేసి పునరుద్ధరించారు. గుంటూరు-కర్నూలు రాష్ట్రీయ రహదారి గొరిజవోలు డైరీ ఫీడర్ వద్ద రెండు విద్యుత్ స్తంభాలు విరిగి పడ్డాయి.

యడ్లపాడులో విరిగిన చెట్లు

యడ్లపాడు: మండలంలో మిచాంగ్ తుఫాను బీభత్సం సృష్టించింది. చలిగాలులు, ఎడతెరపని వానలకు జనజీవనం స్తంభించింది. అధిక వర్షానికి కాల్వలు నిండి రోడ్లపైకి నీరు చేరింది. చలిగాలులు ప్రభావంతో జనజీవనం స్తంభించింది. నక్కవాగు, ఉప్పవాగు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. సొలస, మైదవోలు, జాలాది నుంచి తుర్లపాడు మార్గంలోని గ్రామాల్లోని లోలెవల్ చప్టాలపై మీదుగా వరద నీరు ప్రవహించడంతో రాకపోకలు నిలిచాయి. దింతెనపాడు గ్రామం పరిధిలో నక్కవాగు కట్టమీదుగా వచ్చిన నీరు సమీపంలోని గుడిసెల్లోకి వచ్చి చేరాయి. శనగ పంట పూర్తిగా నీటమునిగింది. అరటి, పొగాకు, పత్తి, మిర్చితోటల్లోనూ వరద చేరింది.

విద్యుత్‌శాఖకు భారీ నష్టం

తుఫాన్‌తో వచ్చిన ఈదురుగాలులు, భారీ వర్షంతో మండల విద్యుత్‌శాఖకు సుమారు రూ.4 లక్షల ఆస్తినష్టం జరిగిందని అధికారులు తెలిపారు. తుఫాన్ కారణంగా సొలసలో రెండు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, ఉప్పరపాలెం, వంకాయలపాడు, ఉన్నవ, కొండవీడులో ఒక్కొక్కటి దెబ్బతిన్నాయి. ఉన్నవ సూర్యనగర్ కాలనీలో 4 విద్యుత్ స్తంభాలు విరిగి పడ్డాయి. దీంతో ఆ నాలుగు వీధుల్లో మినహా విద్యుత్‌ను అనుసంధానించారు. సంగంగోపాలపురం వద్ద భారీచెట్ల కొమ్మలు విద్యుత్ తీగలపై పడ్డాయి. వంకాయలపాడు ఫీడర్ వద్ద యూకలిప్టస్ చెట్లు తీగలపై వాలడంతో విద్యుత్ పరఫరాకు అంతరాయం ఏర్పడింది. దీంతో వంకాయలపాడు, చెంఘీజ్‌ఖాన్‌పేట, సొలస, లింగా రావుపాలెం, పుట్టకోట, కొండవీడు మంగళవారం సాయంత్రం 4.30 నుంచి చీకట్లు అలుముకున్నా యి. తీగలపై భారీ కొమ్మలు పడటంతో వాటిని తప్పించేందుకు యంత్రాలు అవసరం కావడంతో మరుసటి రోజు వరకు ఆయా ఆరు గ్రామాల్లో విద్యుత్ వచ్చే అవకాశం లేదని ఏఈ సాంబశివరావు తెలిపారు. మండల కేంద్రమైన యడ్లపాడులో విద్యుత్ ఇన్సులేటర్లు ధ్వంసం కావడంతో అస్తమానం సరఫరాకు అంతరాయం ఏర్పడుతోంది. సోమవారం రాత్రి నుంచి గ్రామంలోని బీసీకాలనీ, సమీప ప్రాంతంలో రాత్రంతా విద్యుత్ నిలిచిపోయింది.

రొంపిచర్ల మండలంలో

రొంపిచర్ల: తుపాను ప్రభావంతో మండలంలో ఈదురుగాలులతో కూడిన భారీ వర్షాలు కురుస్తున్నాయి. మంగళవారం ఉదయానికి 45.2 మిల్లీ మీటర్ల వర్షంపాతం నమోదైనట్లు తహసీల్దార్ కార్యా లయ అధికారులు తెలిపారు. ఉదయం వేళ ఓ మోస్తరు చినుకులు, ఈదురుగాలులతో ప్రారంభమైన వర్షాలు రాను రాను ఉధృతమయ్యాయి. మండలంలోని విప్పర్లపల్లి, గార్లపాడు, తదితర గ్రామా ల్లో ఈదురుగాలులకు విద్యుత్ స్తంభాలు వరిగాయి. లోతట్టు ప్రాంతాల్లోని గృహాల్లోకి వర్షపు నీరు చేరింది. దీంతో ఉదయం నుంచే మండలంలోని అన్నీ గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిల్చింది. వాగు ఉధృతి క్రమేపీ పెరుగుతుంది. విప్పర్లపల్లి సమీపంలోని ఏదు మండపాల వాగు ఉధృతిగా ప్రవహించటం వల్ల రాకపోకలు నిలచిపోయాయి. ఈ వాగు వల్ల రొంపిచర్ల మండలంలోని పలు గ్రామాలతో పాటు ఈపూరు మండలంలోని గ్రామాలకు కూడా రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఇప్పటికే రైతులు సాగు చేస్తున్న మినుము, కంది, శనగ, వరి, మిర్చి తదితర పంటల్లో వర్షపు నీరు నిల్చి చెరువులను తలపిస్తున్నాయి. తహసీల్దార్ అంకారావు, వీఆర్వోలు, వీఆర్వోలతో సమావేశం ఏర్పాటుచేసి అప్రమత్తంగా ఉండాలని సూచించారు. లో లెవల్ చప్టాల వల్ల బలహీనంగా ఉన్న బ్రిడ్జీలు, వంతెనల వద్ద కాపలా ఏర్పాటు చేయాలని కోరారు. తుఫాన్ పరిస్థితులను ఎప్పటికప్పుడు తెలియచేయాలని ఆదేశించారు.

నరసరావుపేటలో...



బరంపేట డ్రెయిన్‌లో ప్రవాహాన్ని పరిశీలించి అధికారులకు సూచన చేస్తున్న ఎమ్మెల్యే

నరసరావుపేట: నియోజకవర్గంలోని ప్రజలు, రైతులు మిచౌంగ్ తుఫాన్ పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి సూచించారు. గత రెండు రోజుల నుంచి ఎడతెరిపి లేకుండా భారీ వర్షాలు కురుస్తూ ఉండడంతో మంగళవారం మున్సిపల్ కమిషనర్ ఎం.రామ్మోహన్, ఇంజినీరింగ్ అధికారులతో కలిసి పట్టణంలోని గుంటూరురోడ్డు స్వర్గపురి ప్రాంతం, సత్తెనపల్లిరోడ్డులోని చప్టా, బీసీ కాలనీ, సీబీ కాలనీల ప్రాంతాల్లో పర్యటించారు. అలాగే పెద్దచెరువు రెడ్డి కళాశాల వెనుకవైపున ఉన్న చప్టా వద్ద, చెరువు రోడ్డులోని డ్రెయిన్, బరంపేట 31వ వార్డు గుండా ప్రవహించే కత్తవ డ్రెయిన్‌లో మురుగునీటి ప్రవాహాన్ని పరిశీలించారు. సత్తెనపల్లిరోడ్డులోని స్టేడియంకు ఆనుకొని ఉన్న డ్రెయిన్‌లో నీటి ప్రవాహానికి అడ్డుగా ఉన్న తూటికాడను తొలగించాలని అధికారులకు సూచించారు. తుఫాన్ ప్రభావం చాలా తీవ్రంగా ఉన్నందువలన ఆయా ప్రాంతంలో నివసించే ప్రజలను పలకరిస్తూ ఏమన్నా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. మిచౌంగ్ తుపాను సందర్భంగా అప్రమత్తంగా ఉండాలని, ఏ అవసరమొచ్చిన తక్షణమే తమ దృష్టికి తీసుకురావాలని ప్రజలకు సూచించారు. అనంతరం నియోజకవర్గంలోని అన్ని శాఖల అధికారులు సమన్వయంతో వ్యవహరిస్తూ తుఫాన్ సహాయక చర్యల్లో ఎటువంటి సంకుచిత భావాలకు చోటివ్వకుండా పని చేయాలని పలు సూచనలు ఇచ్చారు. మున్సిపల్ డీఇ ఓలేటి శ్రీనివాసరావు, మాజీ కౌన్సిలర్లు మాడిశెట్టి మోహన్, కారుమంచి మీరావలి, వైఎస్సార్‌సీపీ నాయకులు ఎస్‌కే ఆంజనేయులు, షేక్ ఖాదర్ భాషా, సయ్యద్ ఖాదర్ భాషా, షేక్ ఆదం, షేక్ బాబు పాల్గొన్నారు.

వినుకొండలో...



వినుకొండలో ఎస్సీ హాస్టల్ విద్యార్థుల భోజనాన్ని పరిశీలిస్తున్న తహసీల్దారు


వినుకొండ (నూజెండ్ల): తుఫాన్ ప్రభావంతో భారీ వర్షం కురిసింది. దీంతో శివారు కాలనీలో జలమయ్యాయి. పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. మండల తహసీల్దారు కిరణ్‌కుమార్ పట్టణంలోని ఎస్సీ బాలుర వసతి గృహాన్ని సందర్శించారు. పాత భవనం నుంచి విద్యార్థులను మరో భవనంలోకి తరలించారు. వర్షం తగ్గేంత వరకు అక్కడే విద్యార్థులకు వసతి, భోజనం ఏర్పాటు చేశారు. ఆర్టీసీ బస్టాండ్‌లో భారీగా వర్షంపు నీరు చేరడంతో మున్సిపల్ కమిషనర్ వెంకయ్య ఆధ్వర్యంలో నీటిని బయటకు పంపేలా చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా తహసీల్దారు కిరణ్‌కుమార్ మాట్లాడుతూ ఎక్కడైనా ప్రజలకు ఇబ్బందులు కలిగితే అధికారులకు సమాచారం అందజేయాలన్నారు. అన్ని గ్రామా ల్లో వీర్వోలు, రెవెన్యూ సిబ్బందిని అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మండలంలో 22.1 మి.మీ వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు.



యడ్లపాడు- నాదెండ్ల మార్గంలో పడిపోయిన సుబాబుల్ చెట్లు



జాలాదిలో నీటమునిగిన శనగపంట



రోడ్డుపై ప్రవహిస్తున్న ఏడుమండపాల వాగు

చిన్నారులను ఆదుకున్న దాతల సాయం

- విద్యుదాఘాతానికి గురైన చిన్నారులకు మెరుగైన వైద్యం అందించిన మంత్రి రజని
- ఆర్థికసాయం చేసిన ఎమ్మెల్యే బ్రహ్మనాయుడు

వినుకొండ (నూజెండ్ల): మానవత్వం పరిమళించింది. ప్రాణపాయ స్థితిలో ఉన్న ముగ్గురు చిన్నారులకు దాతలు స్పందించడంతో కుటుంబ సభ్యులు ఊరట చెందారు. వినుకొండ పట్టణంలో రెడ్డినగర్‌లో ఆదిత్య స్కూలు పరిసర ప్రాంతంలో యల్లనూరి నాగరాజు-శారద దంపతులు ఇంటిని అద్దెకు తీసుకొని నివాసం ఉంటున్నారు. నాగరాజు వృత్తిరీత్యా ఫొటోగ్రాఫర్‌గా జీవనం సాగిస్తున్నారు. వీరికి ముగ్గురు ఆడ పిల్లలు. పదిరోజుల నాడు ముగ్గురు పిల్లలు ఇంటి డాబాపై ఆడుకునే క్రమంలో ఇంటి పక్కనే ఉన్న 33 కె.వి. సామర్థ్యం కలిగిన విద్యుత్ వైర్లు తగిలి విద్యుదాఘాతానికి గురైనారు. ఈక్రమంలో ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ఆదేశాలతో మేరకు వినుకొండ పోలీసులు హుటాహుటిన గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. నాగరాజు కుంటుబ ఆర్థిక పరిస్థితి మెరుగ్గా లేనందున విషయాన్ని సోషల్ మీడియాలో తెలుసుకున్న క్రమంలో దాతలు తమవంతు సహాయంగా మానవతా దృక్పథంగా విరాళాలు అందించారు. విషయం తెలుసుకున్న ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజని, స్థానిక ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు చిన్నారులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని గుంటూరు జీజీహెచ్ వైద్యాధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు వైద్యశాల్లో చికిత్స పొందుతున్న చిన్నారులను పరామర్శించి తనవంతు సాయంగా రూ.లక్ష రూపాయలు అందజేశారు. పిల్లల ఆరోగ్యం మెరుగవుతోందని, మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నట్లు జీజీహెచ్ వైద్యశాల సూపరెండెంట్ డాక్టరు కిరణ్‌కుమార్ వెల్లడించారు.



రూపిత



పావన



హర్షిత

మిచాంగ్‌కు భయపడక...



జోరు వాన కురుస్తున్నా మండల వాసులకు విద్యుత్ సరఫరాలో ఏర్పడ్డ అంతరాయాన్ని తొలగించడానికి శ్రమిస్తున్న విద్యుత్ సిబ్బంది దృశ్యమిది. బోడిశంభునిపాలెం వద్ద మంగళవారం మధ్యాహ్నం 11 కె.వి.లైనులో ఏర్పడింది. దీన్ని అర్ధరాత్రి పదిగంటల వరకూ పరిష్కరిస్తూ కనిపించారు సిబ్బంది.

–శావల్యాపురం

తప్పుడు దరఖాస్తులపై చర్యలు

శావల్యాపురం: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఫాం-7 తొలగింపు ఓట్లు కోసం నకిలీ ధ్రువీకరణ పత్రాలు అందజేసిన వారికి నోటీసులు ఇవ్వటానికి రంగం సిద్ధం చేసినట్లు తహసీల్దారు షేక్ జాన్‌సైదులు వెల్లడించారు. ఎన్నికల నిబంధనలు మేరకు డబల్ ఓట్లు తొలగింపులు నేపథ్యంలో క్షేత్రస్థాయి చర్యలు చేపట్టగా ఇందులో భాగంగా కొందరు వ్యక్తులు నకిలీ ధ్రువీకరణ పత్రాలు ద్వారా ఫాం-7 తొలగింపు దరఖాస్తులు చేసుకున్నారన్నారు. అలాగే కొంతమంది వ్యక్తులు ఫాం-7 ఐదు కంటె తక్కువ దరఖాస్తు చేసుకుంటే చర్యలు ఉండవని అపోహల్లో ఉన్నారన్నారు. ఫాం-7 అర్జీలో తప్పుడు ధ్రువీకరణ పత్రా లను అందజేసిన ఏఒక్కరినీ వదలమని, వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు.

నిరాశ్రయులకు ఆశ్రయం.. ఆహార వితరణ

యడ్లపాడు: మిచాంగ్ తుఫాను కారణంగా వలస కార్మిక కుటుంబాలు, వీధుల వెంబడి కాగితాలు ఏరుకుని వారు నిరాశ్రయులై తీవ్ర ఇబ్బందులు పడ్డారు. స్థానికుల నుంచి సమాచారం అందుకున్న రెవెన్యూ అధికారులు వెంటనే స్పందించారు. మండల కేంద్రమైన యడ్లపాడు గ్రామంలో సుబాబుల్ తోటల్లో కర్రకొట్టే పనులకు నిమిత్తం ప్రకాశం జిల్లా కందుకూరు నుంచి సుమారు 10 కుటుంబాలు వలస వచ్చా యి. చిన్నపాటి గుడారాలు కట్టుకుని పనులు చేసుకుంటున్న వీరిని తక్షణమే రెవెన్యూ అధికారులు గ్రామంలోని కారుచోల రోడ్డులోని ఎస్సీ కాలనీలో ఉన్న ప్రభుత్వ పాఠశాలకు తరలించారు. అలాగే బోయపాలెం గ్రామంలో కాగితాలు ఏరుకుంటున్న సుమారు 15 మందికి నిరాశ్రయం లేక రోడ్డుపై ఉండటాన్ని గమనించి గ్రామం నుంచి చెంఘీజ్ ఖాన్‌పేట వెళ్లే మార్గంలోని సూపర్ మార్కెట్ వద్ద ఓ ఖాళీ దుకాణంలో నిరాశ్రయం కల్పించారు. రెండు చోట్ల ఆశ్రయం పొందిన వారందరికీ తహసీల్దార్ వైవీబీ కుటుంబారావు ఆహార ప్యాకెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆర్ఐ ఎం చక్రవర్తి, సీనియర్ అసిస్టెంట్ మోజేసు, వీఆర్వోలు పాల్గొన్నారు.



యడ్లపాడులో స్కూల్లో కందుకూరి వలసలకు ఆహార ప్యాకెట్లు అందజేస్తున్న తహసీల్దార్

10న శ్రీకాళహస్తిలో కార్తిక వన సమారాధన

విశ్వజననీ ఫౌండేషన్ అధ్యక్షుడు బ్రహ్మనందం

నరసరావుపేట ఈస్ట్: కార్తిక మాసాన్ని పురస్కరించుకొని విశ్వజననీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈనెల 10వతేదీ ఆదివారం శ్రీకాళహస్తిలోని శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయ ఆవరణలో ఆర్యవైశ్య కార్తిక వన సమారాధన నిర్వహిస్తున్నట్టు ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు బొగ్గారం బ్రహ్మనందం తెలిపారు. ఫౌండేషన్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బ్రహ్మనందం మాట్లాడుతూ, ఫౌండేషన్ శాశ్విత సభ్యుల సమక్షంలో జరగనున్న కార్తిక వన సమారాధనలో ఆర్యవైశ్య కుటుంబ సభ్యులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. వన సమారాధనలో భాగంగా ఉదయం 9 గంటలకు సామూహిక సత్యనారాయణస్వామి వ్రతం ఏర్పాటు చేసినట్టు తెలిపారు. కార్యక్రమానికి సహకారాన్ని అందిస్తున్న శ్రీవాసవి అమ్మవారి ఆలయ కమిటీ అధ్యక్షుడు జూలుగంటి మురళీ మోహన్‌గుప్త, కమిటీ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. విలేకరుల సమావేశంలో ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి కాకుమాను సత్యనారాయణ, కోశాధికారి గుండా సీతారామాంజనేయులు, ప్రోగ్రామ్ కోఆర్డినేటర్లు డాక్టర్ ఏ.గాయత్రిసురేష్ (శ్రీకాళహస్తి), రెడ్డి మురళీకృష్ణ పాల్గొన్నారు.